క్లుప్తంగా

చిన్నారులతో కాసేపు



చిన్నారులతో ముచ్చటిస్తున్న పిరియా విజయ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలోని పంజావీధి ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కాసేపు సరదాగా గడిపారు.

సరియాపల్లిలో బొలేరో పల్టీ

● మందస వ్యక్తి మృతి

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి సరియాపల్లి గ్రామం వద్ద బొలేరో వాహనం రోడ్డు ప్రమాదంలో పల్టీలు కొట్టి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకుపోయింది. దీంతో వాహనం డ్రైవర్ బండి కిందపడి చనిపోయాడు. విషయం తెలుసుకుని గురండి పోలీసులు, ఐఐసీ రవీంద్ర కుమార్ పాత్రో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీకాకుళం జిల్లా మందస మండలం పెద్దపాడుకు చెందిన బి.లింగరాజు (33)గా పోలీసులు గుర్తించారు. ఆయన తన వాహనంతో మందస నుంచి పర్లాకిమిడికి వెళ్తుండగా అదుపుతప్పి పొలాల్లో పడిపోయింది. శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమర్టం చేసి మృతుని బంధువులకు అప్పగించారు. గురండి పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

సువర్ణాపురంలో పశుగ్రాస వారోత్సవాలు

మందస: సువర్ణాపురంలో మంగళవారం పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించారు. మందస, హరిపురం పశు వైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతి ఆధ్వర్యంలో పశుగ్రాసాల సాగు, నిలువ, శాస్త్రీయ పద్ధతిలో మేపడం తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. పాడి పరిశ్రమ లాభసాటిగా సాగాలంటే రైతులకు ఆధునిక పద్ధతులు అవలంబించాలన్నారు. ఈ నెల 14వ తేదీ వరకు వారోత్సవాలు సాగుతాయన్నారు. .

పొల్లాడలో డ్రోన్ సర్వే

వజ్రపుకొత్తూరు: జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంలో భాగంగా సైనూరు పంచాయతీ పొల్లాడలో ఫ్లెట్ డ్రోన్‌తో మంగళవారం సర్వే చేపట్టారు. సర్పంచ్ అట్టాడ గోవిందరావు (గోపి) డ్రోన్ ఎగురవేసి సర్వేను ప్రారంభించారు. పొల్లాడ, సైనూరు, సుంకరజగన్నాథపురం రెవెన్యూ పరిధిలో 710 ఎకరాలను సర్వే చేశారు. సర్వేను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గోవిందరావు రైతులకు సూచించారు. వీఆర్వో భానుచందర్, పంచాయతీ కార్యదర్శి మణికంఠ, విలేజ్ సర్వేయర్ గోపిలోహిత, ఎంపీటీసీ సభ్యుడు గుంటు మాకయ్య, సచివాలయ కన్వీనర్లు గున్నమ్మ, గోకిన గణపతి ఉన్నారు.

'ఆసరా' ఆనందం

వజ్రపుకొత్తూరు రూరల్: జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామం నువ్వలరేవులో 156 పొదుపు సంఘాల ఖాతాల్లో ఆసరా సొమ్ములు జమ కాగా సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లో సొమ్ములు జమ కాలేదు. దీంతో వారు ఇటీవల మంత్రి సీదిరి అప్పలరాజును కలిసి సమస్య విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే బ్యాంక్ అధికారులతో మాట్లాడి మహిళల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో మంగళవారం వజ్రపుకొత్తూరులో గల ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌కు అధిక సంఖ్యలో మహిళలు వచ్చి అకౌంట్లు చూసుకున్నారు.

పవన్‌కల్యాణ్.. ఖబడ్దార్



మందస: పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



కవిటి ఎస్సై కె.రాముకు ఫిర్యాదు అందజేస్తున్న వలంటీర్ల సంఘ ప్రతినిధులు



నందిగాం: పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వలంటీర్లు



కవిటిలో మానవహారం చేస్తున్న గ్రామ వలంటీర్లు

● వలంటీర్ల ఆగ్రహం

మందస: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సేవాదృక్పథంతో పని చేస్తున్న తమపై రాజకీయ దురుద్దేశంతో.. కించపరిచే ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించి నిరసన తెలియజేశారు. తీరు మార్చుకోకపోతే ఖబడ్దార్ అని హెచ్చరించారు. పవన్‌కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం మండలాల్లో మంగళవారం నిరసన ర్యాలీలు చేపట్టారు. మండల కేంద్రమైన మందస పట్టణంలోని బస్టాండ్‌లో వలంటీర్లంతా ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పాటయ్యారు. అనంతరం పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పవన్‌ను అరెస్ట్ చేయాలని నినదించారు. కార్యక్రమంలో వలంటీర్లు కొర్నాన ఝాన్సీ, మణి, ప్రదీప్, శ్యాం, ప్రవీణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. వలంటీర్ల నిరసనకు మందస సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కంచి బెహరా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, నాయకులు చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, దువ్వు జగదీష్, గున్న రమణ, దల్లి జానకిరావు, సుగ్గు కోటేశ్, మద్దిల రామారావు, తమిరి శోభన్‌బాబు మద్దతు పలికి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కవిటి: ప్రభుత్వ పథకాల్ని ప్రజలకు అందించడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న తమపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అసందర్భ ప్రేలాపనలకు చెక్ పెట్టకపోతే తీవ్రపరిణామాలు చవిచూడక తప్పదని మండల వలంటీర్ల సంఘం హెచ్చరించింది. పవన్ వ్యాఖ్యలను ఖండిస్తూ కవిటిలోని వైఎస్సార్‌కూడలిలో పవన్‌వ్యాఖ్యల్ని నిరసిస్తూ చైతన్య ర్యాలీ..మానవహారం నిర్వహించారు. పవన్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. పవన్ కల్యాణ్ నిరాధారమైన అనుచిత వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా వలంటీర్ల సంఘం అధ్యక్షుడు మద్దిలి కాళిదాస్ అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి పవన్ కల్యాణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్సై కె.రాముకు ఫిర్యాదు అందజేశారు.

నందిగాం: ప్రజలకు సేవకులుగా ఉన్న తమపై ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలని మండలానికి చెందిన వలంటీర్లు డిమాండ్ చేశారు. పవన్ వ్యాఖ్యలకు ఖండిస్తూ మండల కేంద్రమైన నందిగాంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజకీయ లబ్ధి, ఎవరి దగ్గరో మెప్పు పొందడం కోసం తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వలంటీర్లు అన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న తమకు తక్షణమే పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, కణితి నారాయణమూర్తి, పోలాకి మోహనరావు, అట్టాడ శ్రీనివాసాయావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయడానికి విశేషంగా కృషి చేస్తున్న తమపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే తమకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇచ్ఛాపురం పట్టణంలోని ప్రధాన రహదారిలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ కూడలిలో మానవహారం చేసి చేశారు. పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జనసేన కార్యకర్తల కవ్వింపు

వలంటీర్లు నిరసన తెలియజేస్తున్న సమయంలో జనసేన కార్యకర్తలు ర్యాలీని భగ్నం చేసేందుకు ప్రయత్నించారు. కవ్వింపు చర్యలకు పూనుకున్నారు. వెంటనే పట్టణ పోలీసులు రంగ ప్రవేశం చేసి జనసేన కార్యకర్తలను అక్కడి నుంచి దూరంగా తరిమివేశారు.



ఇచ్ఛాపురం: బస్టాండ్ కూడలిలో వలంటీర్ల మానవహారం

తెల్లవారిసరికే పింఛన్ అందజేత..



నాపేరు రొక్కం చిట్టితల్లి. భర్త వెంకటరమణతో కలిసి ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ఆరో వార్డు సచివాలయం పరిధిలో ఉంటున్నాం. ఇద్దరిమీ వృద్ధులమే. మమ్మల్ని చూసేవారు కరువయ్యారు. ఈ పరిస్థితిలో వలంటీర్ లావేటి మణి ప్రతి నెల ఒకటో తేదీ ఉదయాన్నే వచ్చి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్నాడు. అవసరమైన సరుకులు అందజేస్తూ అండగా ఉంటున్నాడు. కోవిడ్ రోజుల్లో ఇంటి నుంచి ఎవర్నీ బయట తిరగనీయని సమయంలో మా వలంటీర్ తమకు అవసరమైన నిత్యావసర వస్తువులు, కూరగాయాలను దాతల సహకారంతో అందించేవాడు.

అండగా నిలిచిన వలంటీర్



నా పేరు దుంపల ధనలక్ష్మి. కోటబొమ్మాళి విద్యుత్‌నగర్‌లో ఉంటున్నాను. కరోనాతో భర్త చనిపోయాడు. నేను బయటకు వెళ్లలేని పరిస్థితిలో కోటబొమ్మాళి -1 సచివాలయం పరిధికి చెందిన వలంటీర్ గంధావు ప్రశాంత్ అండగా నిలిచాడు. వైఎస్సార్ బీమాకు దరఖాస్తు చేయించడంతో రూ. రెండు లక్షలు వచ్చాయి. పింఛన్‌కు కూడా వలంటీరే దరఖాస్తు చేయించడంతో పింఛన్ మంజూరైంది. వలంటీర్‌కుధన్యవాదాలు.

అధిక జనాభాతో అనర్థాలు



మాట్లాడుతున్న గోవిందమ్మ



కవిటి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కాశీబుగ్గ: విద్యార్థులకు డిక్షనరీలు అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: ప్రస్తుత పరిస్థితుల్లో అధిక జనాభాతో అనేక అనార్థాలు చోటు చేసుకుంటాయని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ అన్నారు. కళాశాలలో అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జనాభా నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనాభా పెరుగుదల వలన కలిగే అనార్థాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జనాభా పెరుగుదల వలన కలిగే దుష్ప్రయోజనాలపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ల్యూక్‌పాల్, అర్థశాస్త్ర విభాగాధిపతి ఎ.రామారావు, అధ్యాపకులు బాలకృష్ణ, కోటేశ్వరరావు, త్రినాథరావు, జగన్నాథ్ బిసై పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత

కవిటి: జనాభా పెరుగుదల నియంత్రణను సామాజిక బాధ్యతగా ప్రతిపౌరుడూ గుర్తించాలని బెలగాం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ పి.రాకేష్, డాక్టర్ డి.కవిత అన్నారు. ఆర్.బెలగాం పీహెచ్‌సీలో ప్రపంచ జనాభా దినోత్సవ సమావేశంలో వారు మాట్లాడారు. కుటుంబ నియంత్రణ అవసరాన్ని వివరించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం గ్రామంలో వైద్య సిబ్బంది చైతన్యర్యాలీ నిర్వహించారు.

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మధు పర్యవేక్షణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు డిక్షనరీలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు రోణంకి హేమాచలం, కోశాధికారి నెమలపురి అప్పారావు, సభ్యుడు ఎండు దొర పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం

● టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి



సంక్షేమాన్ని వివరిస్తున్న దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను చేరువ చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. కొత్తపేట గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దుక్క రోజా, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీ, మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, మండల కోఆప్షన్ సభ్యుడు రంజాన్ రాజాబాయ్, సర్పంచ్‌లు రాంపాత్రుని సావిత్రి, ఆర్.రంగారెడ్డి, ఆర్.శివారెడ్డి, నూక సత్యరాజ్, గురువెల్లి కేశవరావు, సుంకరి జనార్దన, ఇలపండ కృష్ణమూర్తి, బొనే ఎల్లయ్య, బొడ్డు వెంకటరమణ, ఎస్.వి.రమణ, మెట్టు వాసు, హనుమంతు దాలయ్య, మక్క నారాయణరావు, అక్కురాడ సురేష్, తోట సింహాచలం, ఎంపీటీసీ సభ్యులు బొడ్డు అప్పన్న, బగాది దివాకర్, పూజారి సత్యం, చుక్క లోకనాథం, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, జేసీఎస్ కన్వీనర్లు బమ్మిడి శ్రీనివాస్, తర్ర కామినాయుడు, సింగూరు నారాయణరావు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

● ప్రజావేదికలో డ్వామా పీడీ చిట్టిరాజు



ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

కోటబొమ్మాళి: ఉపాధి పనుల్లో ఫీల్డుఅసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు హెచ్చరించారు. కోటబొమ్మాళి మండలంలో 2022–23 ఏడాదిలో 38 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులు, 8 లక్షల 39 వేల పనిదినాలకు సంబంధించి మంగళవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చీపుర్లపాడు, కురుడు, నిమ్మాడ, కోటబొమ్మాళి, నారాయణవలస, కొత్తపేట గ్రామపంచాయతీలతో పాటు మరో 9 పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి 50,869 రూపాయల రికవరికీ ఆదేశాలు జారీచేశారు. చీపుర్లపాడు ఫీల్డ్ అసిస్టెంటు అక్రమాలకు పాల్పడ్డారని.. చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ నేతింటి అప్పలస్వామితోపాటు పలువురు వేతనదారులు పీడీ చిట్టిరాజుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరావు, మండలప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, ఎంపీటీసీ సభ్యుడు అన్నెపు రామారావు, సర్పంచ్ కాల్ల సంజీవరావు, డ్వామా ఏపీడీ మురళీకృష్ణ, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, సోషల్ ఆడిట్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఏపీవో అరుణ్‌కుమార్, డ్వామా జేఈ హరిప్రసాద్ పాల్గొన్నారు.

సంఘీభావ యాత్రలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్!



యాత్రలో వాహనంపై నిలబడి ఉన్న సంతోష్‌కుమార్ (సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)

టెక్కలి: యువగళం పేరుతో నారా లోకేష్ నిర్వహిస్తున్న పాదయాత్ర రెండు వేల కిలోమీటర్లు దాటిన సందర్భంగా నందిగాంలో టీడీపీ నాయకులు మంగళవారం చేపట్టిన సంఘీభావ యాత్రలో ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు నిర్వహించిన యాత్రలో మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొన్ని సంతోష్‌కుమార్ పాల్గొని అంతా తానే అన్నట్టు వ్యవహరించారు. కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తూ రాజకీయ పార్టీల ర్యాలీలో పాల్గొనడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గతంలో పనిచేసిన మండలాల్లో కూడా విధుల నిర్వహణలో అలసత్వం వహించడం, రాజకీయ పార్టీల సభల్లో పాల్గొనడంతో పలుమార్లు సస్పెండ్ అయిన సందర్భాలు ఉన్నాయి. తాజా పరిస్థితిపై ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

జూదరుల అరెస్టు

సంతబొమ్మాళి: విష్ణుచక్రం గ్రామ సమీపంలోని కొబ్బరితోటల్లో జూదమాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ ఘటనలో అరుగురు పట్టుబడడంతో అరెస్టు చేసినట్టు నౌపడ ఎస్సై కిశోర్‌వర్మ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 14,190 స్వాధీనం చేసుకున్నామన్నారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవు

వజ్రపుకొత్తూరు: వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి అన్నారు. గోవిందపురం పంచాయతీలో సర్పంచ్ పాలిన రమ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమెమాట్లాడారు. మహిళలను చులకన భావంతో చూసిన పవన్‌ను మహిళా లోకం క్షమించదన్నారు. వలంటీర్లకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జగనన్న సురక్ష.. అర్జీదారులకు రక్ష

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం అర్జీదారులకు రక్షణగా నిలుస్తోందని నాయకులు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పకడ్బందీగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్నవారికి 11 రకాల సేవలను ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. మంగళవారం పలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో జెడ్పీ చైరపర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు పిరియా సాయిరాజ్, దువ్వాడ వాణి, అధికారులు పాల్గొన్నారు.



కవిటి: కవిటి-2 సచివాలయంలో అర్జీదారులకు ధ్రువపత్రాల్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు, సమన్వయకర్త సాయిరాజ్



మందస: బీఎస్‌పురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ డొక్కరి దానయ్య



కాశీబుగ్గ: 7, 17వ వార్డుల్లో సర్టిఫికెట్లను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు



సోంపేట: కొర్లాంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



టెక్కలి: నరసింగపల్లిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి



వజ్రపుకొత్తూరు: గోవిందపురంలో అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీ ఉపాధ్యక్షురాలు పాలిన శ్రావణి



నందిగాం: రథజనబొడ్డపాడులో మాట్లాడుతున్న కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్. చిత్రంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి తదితరులు

సంపద కేంద్రాలపై దృష్టి సారించాలి

ఇచ్ఛాపురం రూరల్: చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలపై దృష్టి సారించి, వినియోగంలోకి తీసుకురావాలని ఈవోపీఆర్డీ కె.రామారావు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మరుగుదొడ్ల అవసరమైన వారి సంఖ్యను, అర్ధాంతరంగా నిలిచిపోయినా మరుగుదొడ్ల ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర నివేదికను అందించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

టెక్కలి రూరల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నెలకున్న సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని టెక్కలి డివిజన్ ప్రధానోపాధ్యాయల సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు డిప్యూటీ ఈవో గార పగడాలమ్మని తన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కోశాధికారి చిలుకు కృష్ణారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.హరిబాబు, చిన్నారావు పాల్గొన్నారు.

పెద్దబొడ్డపాడులో వైద్య శిబిరం

వజ్రపుకొత్తూరు రూరల్: పెద్దబొడ్డపాడు గ్రామ సచివాలయంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్యులు 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 25 మంది వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించి ఆస్పత్రికి రిఫర్ చేశారు. సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు, డాక్టర్ పద్మప్రియ, పీఆర్‌ఓ వెంకటేష్, ఏరియా మేనేజర్ తిరుపతి, వైద్యసిబ్బంది యశోద, చిన్నమ్మ, తేజేశ్వరి ఉన్నారు.

రోటరీ గవర్నర్ రూ. 2 లక్షల విరాళం

కంచిలి/సోంపేట: కంచిలి మండలంలోని మండపల్లి గ్రామంలో రోటరీ ఉద్దానం మెడికల్ సెంటర్ భవన నిర్మాణానికి రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు ముందుకొచ్చారు. తనవంతుగా రూ. రెండు లక్షలు విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, సెక్రటరీ పి.వి.కృష్ణారావు, కోశాధికారి కె.రవికుమార్‌లకు అందజేసినట్లు సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుళ్ల రమేష్ మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి

కాశీబుగ్గ: పట్టణ ప్రజలకు మంచినీటిని సరఫరా చేసే పైపులైన్ ఇటీవల లీకయింది. దీంతో రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం తలెత్తింది. మున్సిపల్ మంచినీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి మరమ్మతులు ప్రారంభించి మంగళవారం పూర్తి చేయడంతో సమస్య పరిష్కారమైంది. పనులను మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ పర్యవేక్షించారు.